సాక్షి రాజన్న సిరిసిల్ల

ఆదివారం । 22 । జనవరి । 2023



అమ్మవారి సేవలో ఎస్పీ

సిరిసిల్లక్రైం: సిరిసిల్లలోని గంగాభవాని అమ్మవారిని, మడేలేశ్వరస్వామిని ఎస్పీ రాహుల్‌హెగ్డే శనివారం దర్శించుకున్నారు.



భళా.. సైన్స్ మేళా

సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది.

గరిష్టం/కనిష్టం
31.0/17.0

వాతావరణం

ఆకాశం నిర్మలంగా ఉంటుంది. వర్షం కురిసే అవకాశం లేదు. గాలిలో తేమ ఉంటుంది. ఈదురుగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయి

- జడ్జీలు రవీందర్, ప్రతీక్‌సిహాగ్



క్యారమ్ పోటీలు ప్రారంభించి ఆడుతున్న జడ్జీలు సత్తు రవీందర్, ప్రతీక్‌సిహాగ్

వేములవాడ: క్రీడలు స్నేహభావాన్ని పెంపొందిస్తాయని జడ్జీలు సత్తు రవీందర్, ప్రతీక్‌సిహాగ్ పేర్కొన్నారు. వేములవాడ బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆటల పోటీలను శనివారం ప్రారంభించారు. న్యాయవాదులతో కలసి కాసేపు క్యారమ్ ఆడారు. క్యారమ్, చెస్, షటిల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు స్పోర్ట్స్ సెక్రెటరీ బొడ్డు ప్రశాంత్ తెలిపారు. అధ్యక్షుడు వేముల సుధాకర్, ఉపాధ్యక్షుడు గడ్డం సత్యనారాయణరెడ్డి, న్యాయవాదులు నాగుల సత్యనారాయణ, రేగుల దేవేందర్, పొత్తూరి అనిల్, పిట్టల మనోహర్, గుండ రవి, కందుల క్రాంతికుమార్, పిల్లి మధు, తిరుపతి, పర్లపల్లి అంజయ్య, గొంటి శంకర్, నాగుల సంపత్, నేదూరి అభిలాష్, బొడ్డు గంగరాజు, బొజ్జ మహేందర్, భానుకృష్ణ, మహేశ్, కిరణ్, ప్రభాకర్, శశిధర్, అన్నపూర్ణ పాల్గొన్నారు.

అదనపు టీఎంసీ పనులకు సహకరించాలి : ఆర్డీవో



రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో, తహసీల్దార్

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం మూడో టీఎంసీ వరదకాలువ పనులకు రైతులు సహకరించాలని సిరిసిల్ల ఆర్డీవో శ్రీనివాసరావు కోరారు. మండలంలోని విలాసాగర్‌లో రైతుల రిలేదీక్షల శిబిరాన్ని శనివారం తహసీల్దార్ నరేశ్‌తో కలిసి సందర్శించారు. రైతులతో సమావేశమయ్యారు. భూనిర్వాసితులకు నష్టపరిహారం చెల్లించి, రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఆర్డీవో హామీతో రైతులు 323 రోజులుగా చేస్తున్న దీక్షలు విరమిస్తున్నట్లు ప్రకటించారు. అదనపు టీఎంసీ వరద కాలువ వద్దని రిలేదీక్షలు చేసిన రైతులు చివరికి విరమించడంతో కాలువపనులకు అడ్డంకి తొలగినట్లు అయ్యిందని అధికారులు భావిస్తున్నారు. ఇరిగేషన్ డీఈ విష్ణుప్రసాద్, ఏఈ కార్తీక్, ప్రభాకర్ ఉన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న లక్ష్మీరాజం

ఇల్లంతకుంట(మానకొండూరు): బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని జిల్లా సంక్షేమాధికారి లక్ష్మీరాజం పేర్కొన్నారు. ఈనెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని గురుకుల, కేజీబీవీ, మోడల్‌స్కూల్స్‌లో శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. లక్ష్మీరాజం మాట్లాడుతూ బాలికలను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికలు, మహిళలు ఆపదలో ఉంటే 1098, 181 నంబర్‌లలో ఫిర్యాదు చేయాలని కోరారు. సఖీ కేంద్రం కోఆర్డినేటర్ రోజా, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మధుకర్, సఖీ కేంద్రంసిబ్బంది అంజలి, దేవిక, సంపత్ ఉన్నారు.

నానో యూరియా వాడకాన్ని పెంచాలి



మాట్లాడుతున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు

గంభీరావుపేట(సిరిసిల్ల): రైతులు నానో యూరియా వాడకాన్ని పెంచాలని టెస్కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్‌రావు కోరారు. ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో భాగంగా రైతులకు నానో యూరియా వినియోగంపై గంభీరావుపేట సింగిల్‌విండో కార్యాలయంలో శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఎరువులు ఎంత మోతాదులో వాడాలి, పర్యావరణ పరిరక్షణకు ఎలాంటి చర్యలు తీసుకోవాలో వివరించారు. ఇఫ్కో రాష్ట్ర రీజినల్ మేనేజర్ కృప శంకర్, ఏరియా మేనేజర్ నరేశ్, సింగిల్‌విండో సీఈవోలు రాజిరెడ్డి, సత్యంరావు, కృష్ణ, కిశోర్, సతీశ్, లక్ష్మణ్, రాజయ్య పాల్గొన్నారు.

గోదావరిఖని(రామగుండం): సిరులవేణి.. మన సింగరేణిలో నవశకం నడుస్తోంది. బొగ్గుగనులపై యువరక్తం ఉరకలేస్తోంది. సింగరేణి ఆవిర్భావం నుంచి తట్టా, చెమ్మాస్ చేతపట్టి బొగ్గుపెల్లలు మోసిన కార్మికులు ఆ బాధ్యతను వారసత్వంగా అందిస్తున్నారు. తెలంగాణ ఆవిర్భావం తరువాత కారుణ్య నియామకాల ద్వారా వేలాది మంది కార్మికులు తమ పిల్లలకు సింగరేణి సంస్థ అభివృద్ధిలో అవకాశం కల్పిస్తున్నారు. డిగ్రీలు, పీజీలు, ఇంజినీరింగ్ చదివిన వాళ్లు సైతం కార్పొరేట్ ఆఫీసుల్లో ఉద్యోగం వదులుకుని గనుల్లోకి దిగుతున్నారు. పురుషులతో సమానంగా యువతులు కూడా సింగరేణి తల్లి ఒడిలో కొలువు చేస్తున్నారు. రామగుండం రీజియన్ పరిధిలో 4వేల మంది వరకు యువత ఉద్యోగం చేస్తుండగా.. సింగరేణి వ్యాప్తంగా 12 వేల మంది కార్మికులు ఉన్నారు. సింగరేణి సంస్థలో యువత పాత్రపై సండే స్పెషల్..!!

నల్లనేలలో 'నవ'తరం

సింగరేణిలో పెరుగుతున్న యువత

Sunday Special



- కారుణ్య నియామకాలతో సంస్థకు కొత్తరక్తం
- భారీగా పెరిగిన యువ, మహిళా కార్మికులు
- ఇప్పటికే 12వేల మార్కు దాటిన యువ ఉద్యోగులు



ఇతని పేరు ఆకుల చందు. హుజూరాబాద్ నివాసి. చందు మామ మెడికల్ ఇన్వాలిడేషన్ కావడంతో అల్లుడిగా సింగరేణిలో ఉద్యోగం లభించింది. మూడేళ్లుగా ఆక్టింగ్ సపోర్ట్‌మెన్‌గా డ్యూటీ చేస్తున్నాడు. 'గనిలోకి వెళ్లి విధులు నిర్వహించడం కొత్త అయినప్పటికీ.. ఇన్ని రోజులు పనిచేసిన అనుభవం, సీనియర్ల సూచనలు సలహాలతో ఉత్సాహంగా ముందుకు సాగుతున్నా' అంటూ చందు సంతోషం వ్యక్తం చేస్తున్నాడు.



ఈమె పల్లికొండ శిరీష. రామగుండం పరిధిలోని లింగాపూర్ గ్రామం. తండ్రి మెడికల్ ఇన్‌వాలిడేషన్ కావడంతో అతడి ఉద్యోగం కారుణ్య నియామకం ద్వారా శిరీషకు వచ్చింది. శిరీష అన్నకు ఉద్యోగం ఉంది. తమ్ముడు చదువుకుంటున్నాడు. ఈ క్రమంలో నాన్న తనకు సంస్థలో ఉద్యోగం పెట్టించాడని.. మిషన్ వైండింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్నట్లు శిరీష వివరించింది.

కారుణ్య నియామకంతో..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో కొనసాగుతున్న సింగరేణి సంస్థ రాష్ట్రంలోని గోదావరి పరీవాహకంలో ఏడు జిల్లాల్లో విస్తరించి ఉంది. తెలంగాణ ప్రాంతానికి కొంగుబంగారంగా నిలుస్తున్న సంస్థలో యువ ఉద్యోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు రాష్ట్ర ఆవిర్భావం తరువాత కారుణ్య నియామక ప్రక్రియ చేపట్టినప్పటికీ.. కొందరు కోర్టుకు వెళ్లడంతో నిలిచిపోయింది. దీనిపై పూర్తి స్థాయిలో కసరత్తు చేసిన రాష్ట్ర ప్రభుత్వ యంత్రాంగం ఎలాంటి న్యాయపరమైన చిక్కులు లేకుండా చూసింది. అనారోగ్యం బారినపడిన కార్మికులను మెడికల్ ఇన్‌వాలిడేషన్ ద్వారా ఉద్యోగ విరమణకు అవకాశం కల్పిస్తూ కారుణ్య నియామకాల ద్వారా వారి పిల్లలకు అవకాశం కల్పిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో 2018 మార్చి9 నుంచి కారుణ్య నియామక ప్రక్రియ ప్రారంభమైంది. రెండేళ్ల సర్వీసున్న వారు అనారోగ్య కారణాలతో దిగిపోతే.. వారి పిల్లలకు అవకాశం కల్పిస్తున్నారు. ఇలా సంస్థవ్యాప్తంగా ఇప్పటి వరకు 12 వేల మందికిపైగా యువ కార్మికులు నియామకం అయ్యారు.

ఉన్నతంగా చదివి

సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్, ఇతర రంగాల్లో పనిచేస్తున్న యువత సైతం కారుణ్య నియామకాల ద్వారా సింగరేణిలో పనిచేసేందుకు మొగ్గు చూపుతున్నారు. ఉద్యోగ, ఆరోగ్య భద్రత, నివాసం, కనీస వసతులు, మెరుగైన జీతం ఉండడంతో పోటీపడుతున్నారు. ప్రస్తుతం గనుల్లోకి దిగే యువ కార్మికుల్లో డిగ్రీ, పీజీలు, ఇంజినీరింగ్ చేసినవారు ఉన్నారు. కారుణ్య నిమామకాల్లో కొడుకులు లేనివారు కూతుళ్లకు అవకాశం ఇస్తున్నారు. కూతుళ్లకు సాధ్యం కాని పరిస్థితుల్లో అల్లుళ్లకు బాధ్యత అప్పగిస్తున్నారు.

మహిళా కార్మికులు

సంస్థ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మహిళా ఉద్యోగులకు అవకాశం కల్పిస్తూ సింగరేణి యాజమాన్యం నిర్ణయం తీసుకోవడంతో సంస్థలో వారి సంఖ్య పెరుగుతోంది. ఇద్దరు ఆడపిల్లలు, ఒక్కరే కూతురున్న కార్మికులు ధైర్యంగా వారి సింగరేణి ఉద్యోగాలను అప్పగిస్తున్నారు. కారుణ్య నియామాకాల పక్రియ వేగవంతం కావడంతో సంస్థలో వయస్సుపైబడిన ఉద్యోగులు సంస్థకు దూరమవుతుండగా, వారి స్థానంలో యువ ఉద్యోగులు సంస్థలో చేరుతున్నారు. దీంతో సంస్థలో యువరక్తం పెరిగింది.



సింగరేణిలో కారుణ్య నియామకాలు(ఫైల్)



సింగరేణి సంస్థలో పనిచేస్తున్న మహిళా కార్మికులు

గిరిజన యువతకు అవకాశం

సింగరేణి ప్రభావిత, నిర్వాసిత ప్రాంతాలకు చెందిన గిరిజన యువకు యాజమాన్యం అవకాశం కల్పించింది. ఒకేదఫాగా వెయ్యి మందికి పైగా నియామకం అయ్యారు. ఎస్టీ బ్యాక్‌లాక్ కింద 665మంది, పీడీఎఫ్ కింద 350మందికి ఉద్యోగాలను కల్పిస్తూ సంస్థ నిర్ణయం తీసుకోవడంతో కొలువుకెక్కారు. అదే విధంగా డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా 3,600 మందిని ఎంపిక చేశారు. వీరిలో డాక్టర్లు, మెడికోలు, ఇంజినీర్లు, తదితర విభాగాల్లో పనిచేసేవారు ఉన్నారు.

రామగుండం రీజియన్‌లో యువ ఉద్యోగులు ఇలా..

ఏరియా	పురుషులు	మహిళలు	మొత్తం
ఆర్జీ–1	1,226	68	1,294
ఆర్జీ–2	648	60	708
ఆర్జీ–3,ఏపీఏ	797	43	840

జీవితాన్ని మార్చేసింది



నాన్న మెడికల్ ఇన్‌వాలిడేషన్‌తో వకీల్‌పల్లిగనిలో ఉద్యోగం లభించింది. ఆక్టింగ్ సపోర్ట్‌మెన్, ఆక్టింగ్ కోల్‌కటింగ్ పనులకు వెళ్తున్నా. ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజినీరింగ్ పూర్తి చేసిన. తప్పనిసరి పరిస్థితుల్లో సింగరేణిలో చేరా. ఉద్యోగ భద్రత, విద్య, వైద్యం, మెరుగైన జీతాలుండటంతో ఇటువైపు దృష్టి సారించా. రాబోయే రోజుల్లో మరింత కష్టపడి పదోన్నతి సాధించాలని ఉంది. – మంచాల కల్యాణ్‌కుమార్, వెన్నంపల్లి, కూనారం

ప్రయివేట్ నుంచి సింగరేణికి



నాన్న ఉద్యోగం నాకు ఇచ్చారు. గతంలో ప్రయివేట్ ఉద్యోగం చేసేదాన్ని. డిగ్రీ చదివిన నాకు ఏరియా వర్క్‌షాప్‌లో పోస్టింగ్‌ఇచ్చారు. ఉద్యోగంలోకి చేరి పదినెలలు అయ్యింది. చాలా సంతోషంగా ఉంది. రాబోయే రోజుల్లో క్లర్క్‌గా పదోన్నతి సాధించాలని ఉంది. ప్రస్తుతం వర్క్‌షాప్‌లో ఫ్యాన్ రిపేరింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్నా. – ఈర్ల కల్పన, గోదావరిఖని

భర్త ఉద్యోగం చేస్తున్న



వృత్తిలో ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సాహంగా పనిచేస్తున్నాం. భర్త ఉద్యోగాన్ని చేస్తున్నా. ఏరియా వర్క్‌షాప్‌లో స్టార్టర్ వైండింగ్ విభాగంలో జాబ్ చేస్తున్నా. మహిళలతో పాటు పనిచేయడంతో పాటు టైం తెలవకుండా ముందుకు సాగుతున్నాం.

– కంటె సంధ్యారాణి, గంగానగర్

మల్కపేటలో మోటార్ల బిగింపు

- తుది దశకు 9వ ప్యాకేజీ పనులు
- పరిశీలించిన ఈఎన్‌సీ వెంకటేశ్వర్లు

సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాను సస్యశ్యామలం చేసే కాళేశ్వరం 9వ ప్యాకేజీ పనుల్లో కీలకఘట్టం శనివారం ఆవిష్కృతమైంది. కోనరావుపేట మండలం మల్కపేట సర్జిపూల్ వద్ద రెండు మోటార్ల బిగింపు పనులు తుది దశకు చేరాయి. సిరిసిల్ల మధ్యమానేరు బ్యాక్ వాటర్ గ్రావిటీ ద్వారా మలకపేట సర్జిపూల్‌కు చేర్చేందుకు లైనింగ్ పనులు పూర్తయ్యాయి. రెండు పంపులతో నీటిని ఎత్తిపోసే పనులు జరుగుతున్నాయి. ఈ పనులను కాళేశ్వరం 9వ ప్యాకేజీ ఈఎన్‌సీ నల్లా వెంకటేశ్వర్లు శనివారం పరిశీలించారు. మూడు టీఎంసీల సామర్థ్యం గల మల్కపేట రిజర్వాయర్‌ను ఈ ఏడాది నింపేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగానే పనుల్లో వేగం పెంచారు. మల్కపేటలో రెండు పంపులు పూర్తయితే.. లైనింగ్ పనులను పూర్తిచేసి, సొరంగంలోకి వెళ్లే మార్గాల(ఆడిట్)ను మూసివేసి నీటి తరలింపు, పంపింగ్ మొదలవుతుంది. మల్కపేట రిజర్వాయర్ పనులు తుదిదశకు చేరగా.. మోటార్లు, పంపుల బిగింపు పనులు సమాంతరంగా సాగుతున్నాయి. 9వ ప్యాకేజీ ఎస్‌ఈ సుధాకర్‌రెడ్డి, ఈఈ శ్రీనివాస్‌రెడ్డి, డీఈఈ సత్యనారాయణ, కాంట్రాక్టు ఏజెన్సీ ఎమ్మార్కేఆర్ ఇంజినీర్లు, మోటార్లు, పంపుల పర్యవేక్షణ ఇంజినీర్లు ఉన్నారు.



మోటార్ల బిగింపును పరిశీలిస్తున్న ఈఎన్‌సీ

'కంటివెలుగు'లో నాణ్యమైన పరీక్షలు

- కలెక్టర్ అనురాగ్ జయంతి

సిరిసిల్ల: జిల్లాలో 'కంటి వెలుగు'ను సమర్థంగా నిర్వహిస్తున్నామని, శిబిరాల్లో నాణ్యమైన పరీక్షలు చేస్తున్నామని కలెక్టర్ అనురాగ్ జయంతి పేర్కొన్నారు. హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి వీడియో కాన్ఫరెన్స్‌లో శనివారం మాట్లాడారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు రోజులుగా కంటివెలుగు నిర్వహణ తీరును వివరించారు. పరీక్షలు చేయించుకున్న వారిలో అవసరమైన వారికి కంటి అద్దాలు అందిస్తున్నట్లు తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా వైద్యాధికారి సుమన్ మోహన్‌రావు, కంటి వెలుగు ప్రోగ్రాం అధికారి శ్రీరాములు, కంటి వైద్యులు రజనీ పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

- కాయకల్ప వైద్యురాలు సంతోషి
- ఎల్లారెడ్డిపేట పీహెచ్‌సీ పరిశీలన

ఎల్లారెడ్డిపేట(సిరిసిల్ల): ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని మంథని కాయకల్ప వైద్యురాలు సంతోషి, జిల్లా క్వాలిటీ మేనేజర్ విద్యాసాగర్ సూచించారు. ఎల్లారెడ్డిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం పరిశీలించారు. ఆరోగ్య కేంద్రంలో పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది శుభ్రత, చెట్లు, గార్డెన్, ఫార్మసీ, లేబర్ రూమ్, ఐపీ వార్డులు చెక్ లిస్ట్ ప్రకారం ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆస్పత్రిలో నిర్వహిస్తున్న రిజిస్టర్‌లను పరిశీలించారు. వైద్యురాలు సంతోషి మాట్లాడుతూ ఆరోగ్య కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచితేనే రోగులు త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందన్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ బాబు, వైద్యులు రఘు, ప్రదీప్, స్రవంతి తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాతున్న వైద్యులు

పులకించిన మానేరుతీరం



సిరిసిల్లలోని గంగాభవాని కల్యాణానికి హాజరైన భక్తులు



జనసంద్రమైన సిరిసిల్లలోని మానేరుతీరం



ముస్తాబాద్‌లో ట్రాక్టర్ల ప్రదర్శన



మామిడిపల్లిలో భక్తుల సందడి

సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: జిల్లా వ్యాప్తంగా మానేరుతీరం జనజాతరను తలపించింది. మాఘం అమావాస్యను పురస్కరించుకొని నదీ తీరం వెంబడి గ్రామాల్లోని పలు ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. సిరిసిల్లలో మూడు జాతర్లతో జనం తండోపతండాలుగా మానేరువాగుకు తరలివచ్చారు. గంగపుత్రుల ఆధ్వర్యంలో గంగభవాని, నాయీబ్రాహ్మణుల ఆధ్వర్యంలో రామలింగేశ్వరస్వామి, రజక సంఘం ఆధ్వర్యంలో మడేలేశ్వరస్వామి ఆలయాల్లో కల్యాణోత్సవాలు నిర్వహించారు. మిడ్‌మానేరు బ్యాక్‌వాటర్‌లో మునిగిపోయిన ప్రాచీన శైవక్షేత్రం రామప్ప ఆలయంలో జరగాల్సిన కల్యాణోత్సవం ప్రభుత్వం కేటాయించిన సమీప స్థలంలో నిర్వహించారు. టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, తెలంగాణ టెక్స్‌టైల్, పవర్‌లూం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, కలెక్టర్ అనురాగ్ జయంతి, ఎస్పీ రాహుల్‌హెగ్డే, జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, వైస్‌చైర్మన్ మంచె శ్రీనివాస్, సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు తదితరులు హాజరయ్యారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో బందోబస్తు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో విద్యుత్ దీపాలు, జనరేటర్, మౌలిక వసతులు కల్పించారు.

క్లుప్తంగా

పెండింగ్ స్కాలర్‌షిప్స్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న రవిగౌడ్

సిరిసిల్లఅర్బన్: పెండింగ్ స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో–కన్వీనర్ కంచర్ల రవిగౌడ్ కోరారు. సిరిసిల్లలో శనివారం విలేకరులతో మాట్లాడారు. స్కాలర్‌షిప్ విడుదల విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. నాలుగేళ్లుగా దాదాపు రూ.3వేల కోట్లు బకాయిలు ఉన్నట్లు తెలిపారు. ఉపకార వేతనాలు రాక పేద విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్కాలర్‌షిప్స్ బకాయిలు విడుదల చేయకుంటే కలెక్టరేట్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డివిజన్ ఇన్‌చార్జి ప్రకాశ్, అధ్యక్షుడు సుజిత్‌కుమార్, హాస్టల్ ఇన్‌చార్జి సౌమ్య, అక్షిత, శ్రీజ, అవనిన, నౌరోజ్, విష్ణు ఉన్నారు.

దూడపై చిరుత దాడి

ఇల్లంతకుంట(మానకొండూరు): జిల్లాలో మళ్లీ చిరుత సంచారం కలకలం రేపింది. అటవీ సమీప గ్రామాల ప్రజలు పొలాల వద్దకు వెళ్లేందుకు జంకుతున్నారు. మండలంలోని జవారిపేటకు చెందిన హస్మండ్ల భీమయ్యకు చెందిన దూడపై చిరుత దాడి చేసి చంపింది. తన పొలం వద్ద రోజు మాదిరిగానే పశువులపాక వద్ద దూడను కట్టేసి రాగా.. శుక్రవారం రాత్రి దూడపై చిరుత దాడి చేసి చంపిందని రైతు భీమయ్య తెలిపాడు. ఏడాదికాలంగా చిరుత ఇదే ఏరియాలో సంచరిస్తోందని, ఫారెస్టు అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. దూడపై చిరుత దాడి చేసిన విషయం తెలుసుకున్న ఫారెస్టు సెక్షన్ అధికారి భూలక్ష్మి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. రైతులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

వృద్ధుడి అనుమానాస్పద మృతి

మల్లాపూర్(కోరుట్ల): అదృశ్యమైన వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మండల కేంద్రంలో వెలుగుచూసింది. స్థానికులు, పోలీసుల వివరాలు.. పోచంపాడ్‌కు చెందిన సూతికట్టు గంగారాం(67) కొన్నేళ్ల క్రితం మల్లాపూర్‌కు వలస వచ్చి కూలీ పనులు చేసుకుంటూ స్థానిక దుర్గమ్మకాలనీలో ఒంటరిగా ఉంటున్నాడు. గత సోమవారం నుంచి గంగరాం అదృశ్యమయ్యాడు. దీంతో దుర్గమ్మ కాలనీవాసులు వృద్ధుడి బంధువులకు సమాచారం ఇవ్వడంతో వారు పలు ప్రాంతాల్లో వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గంగారం నివాసానికి సమీపంలోని అటవీప్రాంతంలో ఉపాధిహామీ గుంతలో మృతదేహం పూడ్చిపెట్టినట్లు కనిపించింది. మెట్‌పల్లి సీఐ లక్ష్మీనారాయణ, ఎస్సై నవీన్‌కుమార్ ఘటన స్థలాన్ని పరిశీలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

టీచర్ల సీనియారిటీ లెక్కింపు షురూ..



బదిలీల్లో పారదర్శకత పాటించాలని వినతిపత్రం అందిస్తున్న ఉపాధ్యాయ సంఘం నాయకులు

- నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు
- ఆఫ్‌లైన్ విధానానికి ఉపాధ్యాయుల పట్టు
- బదిలీలకు రంగం సిద్ధం

సిరిసిల్లఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల బదిలీలకు సమయం ఆసన్నమైంది. ఏళ్ల ఎదురుచూపులు ఫలించనున్నాయి. విద్యాశాఖ అధికారులు ఉపాధ్యాయుల సీనియారిటీ జాబితాను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. సబ్జెక్టులవారీగా వివరాలు సేకరిస్తున్నారు. అన్ని కేటగిరీల్లో కలిపి దాదాపు 240 మందికి పదోన్నతులు రానున్నట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ శనివారం వెల్లడించారు.

ఆనందంలో ఉపాధ్యాయులు

ఏళ్ల ఎదురుచూపులు ఫలిస్తున్నాయనే సంతోషంలో ఉపాధ్యాయులు ఉన్నారు. జీవో 317 ప్రకారం బదిలీ జరిగిన ఉపాధ్యాయులకు సీనియారిటీ కోల్పోయే ప్రమాదం ఉందని అలాంటి వారికి న్యాయం చేయాలన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. భార్యభర్తలు ఉద్యోగంలో ఉన్న వారు మళ్లీ బదిలీలు, పదోన్నతులతో కాస్త హైరానా పడుతున్నట్లు తెలుస్తోంది. పరీక్షలు సమీపిస్తున్న వేళ బదిలీలు, పదోన్నతుల గందరగోళం పదోతరగతి ఫలితాలపై ప్రభావం చూపనుందని మేధావులు అభిప్రాయపడుతున్నారు.

జిల్లాలోని ఉపాధ్యాయుల వివరాలు ఇలా..

విషయం	పోస్టులు	ఖాళీలు
గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు గ్రేడ్–2	109	52
ఎస్ఏ గణితం	191	16
ఎస్ఏ ఫిజికల్‌సైన్స్	154	06
ఎస్ఏ బయోలజీ	153	25
ఎస్ఏ సోషల్	170	43
ఎస్ఏ ఇంగ్లిష్	150	24
ఎస్ఏ తెలుగు	61	11
ఎస్ఏ హిందీ	40	10
ఎస్ఏ పీడీ	10	03
ఎల్పీ తెలుగు	105	06
ఎల్పీ హిందీ	102	07
ఎల్పీ ఉర్దూ	2	0
పీఈటీ	48	04
ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎం	99	52
ఎస్‌జీటీ	928	63

పారదర్శకంగా బదిలీలు, పదోన్నతులు



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు పారదర్శకంగా నిర్వహిస్తాం. రాష్ట్రస్థాయి నుంచి వచ్చే నిబంధనలు తప్పకుండా పాటిస్తాం. అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని ముందుకెళ్తాం. జిల్లాలో బదిలీ, పదోన్నతులలో ఉండే ఉపాధ్యాయుల జాబితాను సిద్ధం చేస్తున్నాం.

– రాధాకిషన్, డీఈఓ, సిరిసిల్ల

మొదట స్పౌజ్ బదిలీలు చేపట్టాలి

- తపస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న తపస్ నాయకులు

బోయినపల్లి(చొప్పదండి): రాష్ట్ర ప్రభుత్వం ముందుగా స్పౌజ్ బదిలీలు చేపట్టాలని తపస్ జిల్లా అధ్యక్షుడు గణికంటి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈమేరకు శనివారం సంఘం నాయకులతో కలిసి డీఈవో రాధాకిషన్‌ను కలిసి ఉపాధ్యాయుల బదిలీల సమస్యలు పరిష్కరించాలని వినతిపత్రం అందించారు. జీవో 317 కారణంగా జిల్లాలు మారిన వారికి రెండేళ్ల సర్వీస్ లేకున్నా బదిలీల అవకాశం కల్పించాలని కోరారు. గెజిటెడ్ హెడ్‌మాస్టర్ల పీరియడ్‌ను గతంలో మాదిరగానే ఐదేళ్లకు కొనసాగించాలని కోరారు. బదిలీ, పదోన్నతుల్లో సీనియార్టీకి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్యదర్శి లెంకల జయకృష్ణ, సంఘం నాయకులు వుచ్చిడి పద్మారెడ్డి, సంజీవ్, సురేశ్, విష్ణు ఉన్నారు.

కార్మిక వ్యతిరేక కోడ్‌లు రద్దు చేయాలి

- హమాలీ యూనియన్ కార్యదర్శి ఎల్లారెడ్డి



ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న ఎగమంటి ఎల్లారెడ్డి

సిరిసిల్లటౌన్: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక చట్టాలను వెంటనే రద్దు చేయాలని హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో శనివారం ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. హమాలీ కార్మికుల సంక్షేమానికి వెంటనే సంక్షేమబోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. కార్మికులకు హెల్త్‌కార్డులు, ఇన్సూరెన్స్, పెన్షన్ వసతులు కల్పించాలని కోరారు. కార్మికుల హక్కుల సాధనకు ఈనెల 23న కలెక్టరేట్ ముట్టడి చేపడుతున్నట్లు వెల్లడించారు. ఎలిగేటి రాజశేఖర్, నక్క దేవదాసు, నర్సయ్య, పోచమల్లు పాల్గొన్నారు.

ఆటో దగ్ధం



బావుసాయిపేటలో కాలిన వాహనం

కోనరావుపేట(వేములవాడ): బావుసాయిపేటలోని సయ్యద్ ముజీబ్‌కు చెందిన ఆటోను శనివారం గుర్తుతెలియని వ్యక్తులు దహనం చేశారు. బాధితుని కథనం ప్రకారం వివరాలు. కోనరావుపేట మండలం బావుసాయిపేటకు చెందిన సయ్యద్ ముజీబ్ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం రాత్రి ఇంటి సమీపంలో పార్కింగ్ చేశాడు. అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో వాహనం నుంచి శబ్దం రావడంతో బయటకు వచ్చి చూడగా కాలిపోవడం గమనించాడు. చుట్టు పక్కలవారిని పిలిచి మంటలు ఆర్పే ప్రయత్నం చేయగా అప్పటికే వాహనం కాలిపోయింది. విషయం తెలుసుకున్న కోనరావుపేట పోలీసులు అక్కడికి చేరుకుని సంఘటన స్థలం వద్దనే విచారణ చేపట్టారు.

పోషణ లోపాలు గుర్తించాలి

- డీడబ్ల్యూవో లక్ష్మీరాజం



మాట్లాడుతున్న డీడబ్ల్యూవో లక్ష్మీరాజం

సిరిసిల్లకల్చరల్: నవజాత శిశువుల బలహీనతలు, ఆహార అవసరాలను గుర్తించి సరైన ఆహారాన్ని అందజేయాలని జిల్లా సంక్షేమాధికారి పి.లక్ష్మీరాజం సూచించారు. స్త్రీ, శిశు సంక్షేమశాఖ సారథ్యంలో శనివారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్లకు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన డీడబ్ల్యూవో లక్ష్మీరాజం మాట్లాడుతూ పోషణ లోపాల నివారణ చర్యలపై అవగాహన పెంచుకోవాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ సీడీపీవోలు అలేఖ్య, ఎల్లయ్య, ఏసీడీపీవోలు ఆనందిని, సుచరిత, పోషణ్ అభియాన్ కోఆర్డినేటర్ బాలకిషన్, బ్లాక్ కో–ఆర్డినేటర్లు రాజు, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

వాలీబాల్ క్రీడాకారుల శిక్షణ షురూ..



క్రీడాకారులకు సూచనలిస్తున్న కోచ్ బషీరొద్దీన్



మహిళా క్రీడాకారులతో హెడ్‌కోచ్ ప్రవీణలక్ష్మి



వాలీబాల్ ప్రాక్టీస్ చేస్తున్న సీనియర్ మహిళల జట్టు

- 31 వరకు వేములవాడలోనే క్యాంపు
- ఫిబ్రవరి 2 నుంచి అస్సాంలో పోటీలు

వేములవాడ: తెలంగాణ రాష్ట్ర సీనియర్స్ పురుష, మహిళల జట్లకు వేములవాడలో కోచింగ్ క్యాంప్ శనివారం ప్రారంభమైంది. ఈనెల 31 వరకు ఈ క్యాంపు కొనసాగనుంది. వేములవాడలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తి చేసుకుని నేరుగా అస్సాంకు బయలుదేరనున్నట్లు నేషనల్ చాంపియన్‌షిప్ సెక్రెటరీ చెన్నమనేని శ్రీకుమార్, జిల్లా వాలీబాల్ సెక్రెటరీ రామ్‌దాస్ తెలిపారు. ఫిబ్రవరి 2 నుంచి 9 వరకు అస్సాంలోని గౌహతిలో జరిగే పోటీలలో పాల్గొననున్నారు. రెండు ప్రత్యేక కోర్టులలో ఆరు గురు కోచ్‌ల పర్యవేక్షణ మధ్య క్రీడాకారుల శిక్షణ కొనసాగుతోంది. నవంబర్‌లో వేములవాడలోనే నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీలలో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను జాతీయస్థాయికి ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. 19 మంది పురుషులు, 19 మంది మహిళ క్రీడాకారులకు జాతీయస్థాయి పోటీల కోసం శిక్షణ ఇస్తున్నారు.

రాష్ట్ర పురుషుల జట్టు : కె.రమేశ్(కరీంనగర్), ఎస్.శ్రీనాథ్(కరీంనగర్), ఎం.సచిన్(హైదరాబాద్), పి. కృష్ణచైతన్య(హైదరాబాద్), డి.భార్గవ్(నల్గొండ), ఎన్.శివరాజ్(మహబూబ్‌నగర్), ఎస్.యశ్వంత్(మహబూబ్‌నగర్), అనుదీప్(ఆదిలాబాద్), బి.గణేశ్(ఖమ్మం), వి.రోహిత్(నిజామాబాద్), జి.రాకేశ్(నిజామాబాద్), బి.రంజిత్(వరంగల్), పి.ప్రశాంత్(వరంగల్), ఎ.రాహుల్(మెదక్), ఆర్.ప్రభు(మెదక్), ఎస్.కె.అజ్మత్(రంగారెడ్డి), ఇ.ప్రవీణ్‌కుమార్(రంగారెడ్డి), కోచ్‌లు : బషీరొద్దీన్, ఇ.హరీశ్

రాష్ట్ర మహిళల జట్టు : ఆర్.భారతి(కరీంనగర్), కె.అప్రిత(కరీంనగర్), పి.రమ్య(కరీంనగర్), పి.శ్రీకృతి(హైదరాబాద్), కె.శ్రావ్య(మెదక్), ఎం.సుమలతాబాయి(మెదక్), ఎస్.జె.షణ్ముఖీ(రంగారెడ్డి), ఎం.అక్షిత(రంగారెడ్డి), ఎం.అఖిల(రంగారెడ్డి), కె.లావణ్య(నల్కొండ), వి.ఐశ్వర్య(నల్గొండ), కె.అనూష(నల్గొండ), కె.సుప్రియ(నిజామాబాద్), ఎం.లావణ్య(ఆదిలాబాద్), ఎస్.మేఘన(హైదరాబాద్), కె.సౌమ్య(హైదరాబాద్).

కోచ్‌లు : ప్రవీణలక్ష్మి, టి.కుమార్ **ట్రైనర్** : జి.సంపత్

జోగాపూర్‌లో రౌడీషీటర్ హత్య

- పాతకక్షల నేపథ్యంలో చంపారని అనుమానం
- బస్టాండ్ సమీపంలోనే దాడి చేసిన దుండగులు
- పరిశీలించిన వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి




మృతదేహాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ నాగేంద్రాచారి



శంకర్(ఫైల్)

చందుర్తి(వేములవాడ): చందుర్తి మండలం జోగాపూర్‌కు చెందిన రౌడీషీటర్ గొల్లపల్లి శంకర్‌గౌడ్ ఉరఫ్ మర్డర్ శంకర్(45)ను శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేశారు. పాతకక్షల నేపథ్యంలో హత్య జరిగినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. వివరాలు స్థానికుల కథనం ప్రకారం. జోగాపూర్ బస్టాండ్ సమీపంలో శనివారం రాత్రి నిల్చున్న శంకర్‌గౌడ్‌ను ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు వెనుక నుంచి వచ్చి తలపై నరికారు. దీంతో అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. హత్య విషయం తెలియడంతోనే వేములవాడ డీఎస్పీ నాగేంద్రాచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్ హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకున్నారు. హత్యకు గల కారణాలపై విచారణ చేపడుతున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టమ్ కోసం సిరిసిల్లలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతునికి ఇద్దరు భార్యలు, ఐదుగురు పిల్లలు ఉన్నారు. గొడ్డలితో దాడి చేశారా? వేటకొడవళ్లు వాడారా.. అనేది తెలియాల్సి ఉంది. హత్యకు గల కారణాలు తెలియరాలేదు.

మానవత్వం చాటిన ట్రాఫిక్ ఎస్సై



సిరిసిల్లక్రైం: సిరిసిల్లలో శనివారం గంగమ్మ జాతరకు వచ్చిన ఓ వృద్ధుడు సొమ్మసిల్లి పడిపోవడంతో ట్రాఫిక్ ఎస్సై స్పందించారు. మానేరువాగు తీరాన ఉన్న గంగమ్మ దర్శనానికి ఓ వృద్ధుడు వచ్చి.. స్పృహ కోల్పోగా.. గమనించిన ట్రాఫిక్ ఎస్సై రాజు, సిబ్బంది కరుణాకర్, స్వామి సకాలంలో స్పందించారు. వృద్ధుడిని అతని ఇంటికి పోలీసు వాహనంలో తరలించారు.

మైనార్టీ గురుకులం.. భవితకు సోపానం

- విద్యాలయాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం
- ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో అవకాశం
- అర్హత పరీక్షలో మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు
- ఎంపికైతే ఉచిత విద్యతోపాటు వసతి కల్పన



కరీంనగర్: పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్యనందించాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. ఈ నేపథ్యంలో ఉచిత విద్యతోపాటు వసతి కల్పించి విద్యార్థులను ఉన్నతులుగా తీర్చిదిద్దుతున్న ఈ విద్యాలయాల్లో ప్రవేశానికి ఈ నెల 30లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. మైనార్టీ విద్యార్థులు ఆంగ్ల మాధ్యమంలో విద్యనభ్యసించేందుకు మైనార్టీ గురుకులాలు వరంగా మారాయి. నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో విద్యాబోధన సాగుతోంది. 2023–24 విద్యాసంవత్సరానికి గాను 5 నుంచి 9వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలో 16 విద్యాలయాలు

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్నసిరిసిల్ల జిల్లాల్లో 16 మైనార్టీ గురుకులాలు ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 5వ తరగతిలో 80 సీట్లు ఉన్నాయి. అన్ని పాఠశాలల్లో కలిపి 1,280 సీట్లున్నాయి. మిగతా తరగతులకు సీట్ల ఖాళీలను బట్టి ప్రవేశం కల్పిస్తారు. ఈ విద్యాలయాల్లో 5వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంలో బోధన జరుగుతోంది. విశాలమైన తరగతి గదులున్నాయి. విద్యార్థులకు క్రీడలు, యోగాసనాలకు ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు. పదో తరగతి తర్వాత భవిష్యత్తులో ఎంచుకోవాల్సిన కోర్సులపై అవగాహన కల్పిస్తారు.

కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు..

కరీంనగర్ జిల్లాలో 9 పాఠశాలలు ఉండగా 5 బాలుర, 4 బాలికలకు చెందినవి. 4 కళాశాలలు కరీంనగర్, జమ్మికుంట, మానకొండూర్, హుజూరాబాద్‌లలో ఉన్నాయి. ఒక్కో పాఠశాలలో 80 చొప్పున 720 సీట్లు భర్తీ చేస్తారు. కళాశాలల్లో ఎంపీసీ, బైపీసీ, హెచ్ఈసీ, ఎంఈసీ, సీఈసీ కోర్సులు, వాటిల్లో 160 సీట్లు ఉన్నాయి.

ముస్లింలకు 51, ఇతరులకు మిగతా సీట్లు..

మైనార్టీ గురుకులాల్లో ప్రవేశానికి http:///tmreis.telangana.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలి. ఒక్కో పాఠశాలలో ముస్లింలకు 51, క్రిస్టియన్లకు 5, జైనులు, పార్శీలు, బౌద్ధులు, సిక్కులకు ఒక్కొక్కటి చొప్పున మొత్తం 60 సీట్లు, ఎస్సీలకు 5, ఎస్టీలకు 3, బీసీలకు 10, ఓసీలకు 2 చొప్పున మొత్తం 20 సీట్లు కేటాయించారు. దరఖాస్తుకు ఆధార్‌కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు అవసరమవుతాయి. ప్రవేశ పరీక్షలో వచ్చిన మార్కుల ఆధారంగా ఎంపిక చేస్తారు. గ్రామీణ ప్రాంత విద్యార్థుల తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల వారి వార్షికాదాయం రూ.2 లక్షల లోపు ఉన్నవారు అర్హులు.

సద్వినియోగం చేసుకోవాలి



ప్రతీ విద్యార్థి చదవాలన్న లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం మైనార్టీ గురుకులాలను ప్రారంభించింది. వీటిల్లో ఒక్కో విద్యార్థిపై రూ.లక్షలు వెచ్చిస్తున్నాం. నాణ్యమైన భోజనం అందించడంతోపాటు అర్హత గల అధ్యాపకులతో విద్యనందిస్తున్నాం. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని పేద విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. మరిన్ని వివరాల కోసం మైనార్టీ గురుకులాల పాఠశాలల్లో ప్రిన్సిపాళ్లను సంప్రదించాలి. 99490 64858, 73311 70844 నంబర్లకు ఫోన్ కూడా చేయవచ్చు.

– పులి మధుసూదన్, మైనార్టీ జిల్లా సంక్షేమ శాఖ అధికారి

మండల పరిషత్ సామగ్రి తరలింపు



తంగళ్లపల్లి(సిరిసిల్ల): తంగళ్లపల్లి మండల పరిషత్ కార్యాలయం ఇన్నాళ్లు అద్దె భవనంలో కొనసాగిన విషయం తెలిసిందే. ఆఫీస్ సొంత భవనాన్ని ఇటీవల మంత్రి కేటీఆర్ ప్రారంభించగా.. పాతభవనంలోని సామగ్రి, రికార్డులను తరలిస్తున్నారు. సోమవారం నుంచి నూతన భవనంలోనే కార్యకలాపాలు కొనసాగుతాయని సూపరింటెండెంట్ విజేందర్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి జిల్లా కబడ్డీ పోటీలు



వేములవాడరూరల్: వేములవాడ మండలం నూకలమర్రిలో చైతన్య యూత్ క్లబ్ ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జరిగే ఈ పోటీలకు అన్ని మండలాల నుంచి కబడ్డీ క్రీడాకారులు హాజరుకావాలని యూత్ క్లబ్ అధ్యక్షుడు రోమాల జగదీశ్వర్, కార్యదర్శి పొత్తూరి జనార్దన్ తెలిపారు. మొదటి బహుమతి రూ.20,116, రెండో రూ.15,116, మూడో రూ.10,116, నాలుగో బహుమతి రూ.5,116 నగదు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు భోజనం ఏర్పాటు చేస్తున్నారు.